


పసుపు రైతుల ఆందోళన - 10లో▸

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు రైతులు ఆందోళన చేశారు. ధర పెంచేవరకూ పసుపు అమ్మమని తేల్చిచెప్పారు.



అడవి నుంచి.. పుడమి ఒడికి

గాజర్ల రవి బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరగగా నాటి ఉద్యమకారులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. నేడు అంత్యక్రియలు జరగనున్నాయి. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వృత్తి నైపుణ్యం సాధించాలి

- సీపీ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం: పోలీస్ అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యం సాధించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. యూనిట్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. డ్యూటీ మీట్‌లో విభాగాల వారీగా రాణించిన కమిషనరేట్ పరిధి పోలీసులను జోనల్ స్థాయిలో నిర్వహించే మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈఏడాది రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలకు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ అధికారులు వృత్తినైపుణ్యం సాధించడం ద్వారా, నేరస్తులను త్వరగా గుర్తించడంతో పాటు, ప్రజలకు సత్వరమే న్యాయం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్ అదనపు డీసీపీ రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్‌తో పాటు, జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం..



ఎంజీఎం: ప్రజల భాగస్వామ్యంతో క్షయరహిత జిల్లాగా మారుద్దామని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. గురువారం టీబీ అలర్ట్ ఇండియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పిల్లల్లో క్షయ వ్యాధి నివారణ గురించి ఐఎంఏ హాల్‌లో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. డివిజన్, మండల స్థాయిలో పిల్లల్లో క్షయను గుర్తించడంపై అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్షయ అంటువ్యాధి అని ప్రీవలెన్స్ రేట్ రోజురోజుకూ అధికమవుతోందన్నారు. ఎవరికైనా క్షయ లక్షణాలు కనిపిస్తే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సాయంతో పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ ప్రకాశ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య, క్షయ వ్యాధి నియంత్రణ ప్రోగ్రాం అధికారి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.126.80 కోట్లు జమ

హన్మకొండ: హనుమకొండ జిల్లా రైతుల ఖాతాల్లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.126.80 కోట్లు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్ తెలిపారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు రైతులకు పెట్టుబడి సాయంగా జిల్లాలోని 14 మండలాలకు చెందిన 1,35,765 రైతులకు రూ.126,80,04,861 జమ చేసినట్లు ఆయన తెలిపారు.

వరంగల్ జిల్లాలో 119.42 కోట్లు జమ

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో గురువారం 1,41,727 మంది రైతుల ఖాతాల్లో రూ.119.42 కోట్లు జమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. రైతు భరోసా నిధులు ప్రభుత్వం జమ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయ విజ్ఞానానికి ఇ-లైబ్రరీ దోహదం



వరంగల్ లీగల్: న్యాయ విజ్ఞానానికి ఇ-డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగకరమని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ తెలిపారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా బార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఇ-లైబ్రరీని గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.పట్టాభిరామారావు, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలుస సుధీర్, జనరల్ సెక్రటరీ రమాకాంత్, వైస్ ప్రెసిడెంట్ మైదం జయపాల్, జాయింట్ సెక్రటరీ మునిపెల్లి శ్రీధర్‌గౌడ్, లేడీ జాయింట్ సెక్రటరీ రేవూరి శశిరేఖ, లైబ్రరీ సెక్రటరీ గుండా కిషోర్‌కుమార్, ట్రెజరర్ సిరుమల్ల అరుణ, తదితరులు పాల్గొన్నారు.



- హన్మకొండ అర్బన్: ఈచిత్రంలో కనిపిస్తున్నది జులైవాడ ప్రభుత్వ హైస్కూల్‌లో నల్లాలు లేని వాష్‌ఏరియా. ఈ స్కూల్లో సుమారు 450మంది విద్యార్థులున్నారు. ఇక్కడ విద్యార్థులకు తాగడానికి నీరు అందుబాటులో లేదు. బోర్ నుంచి ఉప్పునీరు వస్తోంది. టీచర్లు డబ్బులు జమ చేసుకొని మంచి నీళ్లు అందిస్తున్నారు. మిషన్ భగీరథ కోసం ట్యాంకులు నల్లాలు బిగించినప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదు.



- విద్యారణ్యపురి: హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 196 మంది విద్యార్థులున్నారు. గురువారం సాక్షి విజిట్ చేయగా 110 మంది హాజరయ్యారు. తరగతి గదులు సరిపడా ఉన్నాయి. కానీ, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో లేవు. గతంలో మన ఊరు మన బడి కింద రూ.4లక్షల వ్యయంతో బాలురకు, బాలికలకు వేర్వేరుగా రెండు యూనిట్ల టాయ్‌లెట్ల నిర్మించారు. కానీ, నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగానే వదిలివేశారు. పాఠశాల ఆవరణ లోతుగా ఉండడంతో వర్షం వస్తే నీళ్లు నిలిచిపోతున్నాయి. మొరం పోయాల్సిన అవసరం ఉంది. ఈ పాఠశాలలో హెచ్‌ఎంతోపాటు ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.



- ఖిలా వరంగల్: ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఖిలా వరంగల్ మధ్యకోటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. 2016–2017 సంవత్సరంలో అప్పటి తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ రూ.45 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ స్లాబ్ వరకు నిర్మాణం పూర్తిచేసి పనులు మధ్యలోనే వదిలేశాడు. దీంతో 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాత భవనంలోని రెండు గదులతోపాటు వరండాలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఇటీవల వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అసంపూర్తి భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే పనులు నిర్మాణం పూర్తిచేసి విద్యార్థులకు తరగతి గదులు అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

బడి.. వసతులు కొరవడి

టీచర్లుంటే విద్యార్థుల్లేరు.. విద్యార్థులుంటే టీచర్లు లేరు

- పలుచోట్ల మూతబడిన పాఠశాలలు
- అధ్వానంగా మూత్రశాలలు
- పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

శిథిలావస్థలో భవనాలు.. సమస్యల నడుమ చదువులు





కాజీపేట మండలం అయోధ్యపురంలో పాఠశాల శిథిల భవనం, సుబేదారి ఉర్దూ మీడియం పాఠశాలలో అసంపూర్తిగా టాయ్‌లెట్లు

సాక్షిప్రతినిధి, వరంగల్/నెట్‌వర్క్ : సర్కారు బడి సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. ఓ వైపు ప్రైవేట్‌తో పోటీ పడలేక.. మరోవైపు మౌలిక వసతుల లేమితో సతమతమవుతోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. బడిబాట, ఉపాధ్యాయుల ప్రచారాన్ని నమ్మి పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్య అందడం లేదు. చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. పారిశుద్ధ్యం లోపించింది. కొన్ని పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని విద్యార్థుల్లేక మూతబడ్డాయి. ఇంకొన్ని చోట్ల విద్యార్థులున్నప్పటికీ చదువు చెప్పే వారు లేరు. పలు చోట్ల మధ్యాహ్న భోజనం అస్తవ్యస్తంగా మారింది. ఇలా.. గ్రేటర్ పరిధిలోని ప్రతీ పాఠశాలను ఏదో ఒక సమస్య వేధిస్తున్నట్లు గురువారం 'సాక్షి' విజిట్‌లో తెలిసింది.

ప్రధానంగా టాయ్‌లెట్స్ సమస్య..

పాఠశాలలు పునఃప్రారంభమై వారంరోజులైంది. హనుమకొండ జిల్లాలో విద్యార్థుల హాజరు 50నుంచి 60శాతం వరకే ఉంటోంది. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధానంగా టాయ్‌లెట్స్ సమస్య విద్యార్థులను వేధిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి ద్వారా చేపట్టిన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 492 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలుండగా అందులో 19 స్కూళ్లలో అసలు టాయ్‌లెట్సే లేవు. మరికొన్నిచోట్ల సరిపడా లేవు. 154 పాఠశాలల్లో కిచన్ షెడ్లు లేవు. దీంతో మధ్యాహ్నం వంటకు ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లాలో 41 పాఠశాలల్లో అసలే విద్యార్థులు లేరు.

- కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు టీచర్లు ఉండగా.. బోధనకు కేవలం రెండు తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక గది శిథిలావస్థకు చేరుకుంది.
- విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 347మంది విద్యార్థులున్నారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నందున విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు మరో ఏడుగురు ఎస్‌జీటీలు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మరో ఐదుగురిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద గతేడాదిలో కేటాయించారు. 2 నుంచి 5వ తరగతి వరకు రెండు సెక్షన్ల చొప్పున ఉన్నాయి. దీంతో మరో ఇద్దరు ఉపాధ్యాయుల అవసరం ఉందని భావిస్తున్నారు. అలాగే హనుమకొండలోని సుబేదారి యూపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో అసంపూర్తి మరుగుదొడ్లు దర్శనమిస్తున్నాయి. గతంలో మన ఊరు–మనబడి కింద పనులు చేపట్టి వదిలేశారు. కొద్దిరోజుల క్రితం అమ్మ ఆదర్శ పథకం కింద మళ్లీ అవే పనులను చేపట్టారని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.. లోపల బేసిన్స్ వేశారు. చుట్టూ టైల్స్ వేయాల్సింది. అదేవిధంగా కిచెన్ షెడ్డు లేదు. పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు 50మంది వరకు విద్యార్థులున్నారు. హెచ్‌ఎం, నలుగురు టీచర్లు పనిచేస్తున్నారు.



- హసన్‌పర్తి: ఇది చింతగట్టు క్యాంప్‌లోని ప్రాథమిక పాఠశాల. గతేడాది ఈ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించారు. ఈఏడాది ఆవిద్యార్థులు మరో పాఠశాలలో చేరారు. దీంతో పాఠశాల మూత పడింది. 1980లో ఎస్సారెస్పీ ప్రాజెక్టు సందర్భంగా ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు కాగా.. అప్పుడు ప్రైవేట్ పాఠశాలలు లేకపోవడంతో చింతగట్టు క్యాంప్‌లో విధులు నిర్వహించిన ఉద్యోగులంతా తమ పిల్లలతో పాఠశాల కిటకిటలాడింది. ఇక్కడి ఉద్యోగుల బదిలీ అనంతరం విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గింది. విద్యార్థులు లేక ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలలకు వెళ్లారు.

రోడ్డు దాటాలంటే భయం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలోని పాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భయంభయంగా రోడ్డు దాటుతున్నారు. పెద్దమ్మగడ్డ, కేయూ బైపాస్ రోడ్డు ఇరుకుగా ఉండడం, వాహనాలతో రద్దీగా ప్రమాదకరంగా ఉంటుంది. ప్రతీ రోజు విద్యార్థులను ఉపాధ్యాయులే దగ్గరుండి ఇలా రోడ్డు దాటిస్తుంటారు.



వాహనాలు నిలిపేసి విద్యార్థులను రోడ్డు దాటిస్తున్న ఉపాధ్యాయులు

కలహాల కాంగ్రెస్..

- కొండా మురళి వ్యాఖ్యలతో బట్టబయలు
- తారస్థాయికి చేరిన కాంగ్రెస్ గ్రూప్ వార్
- సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసిన మురళి
- ఎమ్మెల్యేలు రేవూరి, కడియంపై సీరియస్ వ్యాఖ్యలు
- ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ రాజకీయ దుమారం



కొండా మురళి, కడియం శ్రీహరి, రేవూరి

- సాక్షిప్రతినిధి, వరంగల్

- వివరాలు 10లో▸

బనకచర్లతో ఎడారవ్వనున్న ఉమ్మడి జిల్లా

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పక్కన బీఆర్‌ఎస్ నాయకులు

హన్మకొండ: గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఏడారిగా మారుతుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా జలాల గురించి తెలియని రేవంత్‌రెడ్డి తెలంగాణ నీటి వనరులను ఎలా కాపాడతారని ప్రశ్నించారు. చిన్న పగుళ్ల సాకు చూపి కాళేశ్వరం కూలిపోయిందన్నారని. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే రైతుల పొలాలను ఎండగొట్టిందని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు, సాగునీటి అవసరాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించుకున్న, అభివృద్ధి చేసుకున్న పాకాల, గణపురం, లక్నవరం రిజర్వాయర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదు చేయడాన్ని పడుతున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్యేలు కనీసం నోరు మెదపడం లేదని తూర్పారబట్టారు. రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు నీటి దోపిడీకి గోదావరి బనకచర్ల కడుతుంటే రేవంత్ రెడ్డి ఎలా అడ్డుకుంటాడని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు ఉడతల సారంగపాణి, జోరిక రమేశ్, తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్, నార్లగిరి రమేశ్, పులి రజనీకాంత్, బండి రజనీ కుమార్, శోభన్ కుమార్, నయీముద్దీన్, సల్వాజీ రవీందర్ రావు, జానకి రాములు, అఫ్జల్, రామ్మూర్తి, మూటిక రాజు, రాజ్ కుమార్, శరత్ చంద్ర, వీరస్వామి, రాకేశ్, శ్రవణ్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో కోవర్టులున్నారు..

- వరంగల్ పోలీస్ కమిషనర్ గుర్తించాలి
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



రాహుల్‌గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కొండా మురళి

రామన్నపేట: పోలీసు శాఖలోనే కోవర్టులు ఉన్నారని, అది పోలీసు కమిషనర్ గుర్తించాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సూచించారు. గురువారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో భారీ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ.. బీసీ నాయకుడిని అయినందుకే తనపై కక్ష కట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కొండా మురళి ఉన్నంత వరకు తూర్పులో రెండో నాయకుడు ఉండరని, కార్యకర్తలకు, నాయకులకు ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానన్నారు. 'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలని ఆందోళనలు చేస్తామంటే పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. బీసీ కులాల్లో తనకు రెండు కులాలకు చెందిన పద్మశాలీ, కాపు కులస్తుల మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. అర్హులైన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, జారతి రమేశ్, కొత్తపల్లి శ్రీనివాస్, సకినాల రజనీకాంత్, బస్వరాజు కుమారస్వామి, పోశాల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన దేవాదుల నీటి పంపింగ్..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని దేవాదుల ఇన్‌టెక్ వెల్ వద్ద పంపింగ్ నిలిపివేశారు. పంపింగ్ వద్ద మూడు ఫేజ్‌లలో పది మోటార్లు ఉండగా అందులో సెకండ్ ఫేజ్‌లో ఉన్న రెండు మోటార్లను ఆన్ చేసి 494 క్యూసెక్కుల నీటిని దిగువకు బుధవారం వరకు పంపింగ్ చేశారు. ఈ క్రమంలో గురువారం అందులోని ఒక మోటారును ఆఫ్ చేసి మరో మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు పంపింగ్ చేస్తున్నారు.

డ్రెయినేజీ పనుల్లో నాణ్యత డొల్ల!

కమిషనర్ గారూ.. క్వాలిటీ పరిశీలించండి

- 500 మీటర్ల పనులకు రూ.50 లక్షలు కేటాయింపు
- ఇసుకకు బదులు క్రషర్ రోబో చూర
- నాసిరకం కంకర, సిమెంట్
- దారి తప్పిన గ్రేటర్ అభివృద్ధి పనులు
- కాంట్రాక్టర్లకు ఇతోధికంగా సహకరిస్తున్న ఇంజనీర్లు



నాణ్యత లేని సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు



నిర్మాణ దశలోనే పడిన రంధ్రాలు, పగుళ్లు

వరంగల్ అర్బన్: గ్రేటర్‌లో అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నా.. కనీసం క్షేత్రస్థాయిలో వర్క్ ఇన్‌స్పెక్టర్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది కూడా అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రజల ప్రయోజనాల కంటే తమకు కావాల్సిన కాంట్రాక్టర్ల స్వలాభం, నాలుగు కాసులు వెనుకేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు మచ్చుకు ఒక్క ఉదాహరణే వరంగల్ దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ నుంచి కొత్తవాడ బైపాస్ రోడ్డులోని డ్రెయినేజీ నిర్మాణం.

నాణ్యతకు తిలోదకాలు

బల్దియా నిధులు రూ.50లక్షలతో 500 మీటర్ల డ్రెయినేజీ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకుని ఒప్పందాలు పూర్తి చేసుకున్న చాలా నెలల తర్వాత పనులు మొదలు పెట్టారు. పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు కడుతుండగానే మరో వైపు పగుళ్లు, రంధ్రాలు పడుతున్నాయి.

అంతా క్రషర్ మెటీరియలే..

ప్రభుత్వ నిబంధనల మేరకు గోదావరి ఇసుక, నాణ్యమైన కంకర, సిమెంట్‌తో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలి. కానీ, సదరు కాంట్రాక్టర్ ఇసుకకు బదులుగా క్రషర్‌లో వెలువడే రోబో ఇసుక, కంకర చూర, నాణ్యత లేని కంకర ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. డ్రెయినేజీ ఒకవైపు కడుతుండగానే మరోవైపు రంధ్రాలు పడి నీళ్ల ఊటలు వస్తున్నాయి. నెలలు గడవకముందే ఈ నిర్మాణం పూర్తిగా ఛిద్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కమిషనర్ కళ్లెం వేసేనా?

బల్దియాకు తాజాగా కొత్త కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ విధుల్లో చేరారు. నగరంలో దారి తప్పిన అభివృద్ధి పనుల నాణ్యతను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తా..

దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ నుంచి 80 ఫీట్ల రోడ్డు వరకు జరుగుతున్న డ్రెయినేజీ పనుల నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షిస్తా. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

- రంగనాథ్, బల్దియా డీఈ

కలెక్టరేట్‌లో వివిధ శాఖల పరిశీలన



క్యాంటీన్‌లోని సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం సందర్శించారు. రెవెన్యూ, ఇతర విభాగాలను స్వయంగా సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లోని మహిళా క్యాంటీన్‌కు వెళ్లి అక్కడ న్యూస్ పేపర్లపై ఆహార పదార్థాలు ఉంచడం చూసి ఇలా.. ఉంచితే వాటి రంగు ఆహారపదార్థాలకు అంటుతుందని, ఆరోగ్యానికి హానికరమన్నారు. క్యాంటీన్‌లో అన్ని రకాల తినుబండారాలు, స్నాక్స్ నాణ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆదాయం ఎంత వస్తుంది? ఖర్చులు ఏంటి అనే విషయాల్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ గణేశ్, ఏఓ గౌరీ శంకర్, తదితరులు ఉన్నారు.

ముగిసిన బడిబాట



హనుమకొండ సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు క్రీడలు ప్రారంభిస్తున్న ఎంఈఓ నెహ్రూ

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఈనెల 6నుంచి ప్రారంభమైన బడిబాట గురువారం ముగిసింది. చివరిరోజు వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. నడికూడ పాఠశాలలో క్రీడాపోటీలను జెడ్పీ సీఈఓ విద్యాలత ప్రారంభించారు. దామెర మండలం ఊరుగొండ ఉన్నత పాఠశాలలో క్రీడలను కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడలను ఎంఈఓ నెహ్రూ ప్రారంభించారు. బడిబాట ముగిసేనాటికి హనుమకొండ జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు 3,228 మంది విద్యార్థులు నూతనంగా నమోదయ్యారు. అందులో ఒకటోతరగతిలో 1,133 మంది ప్రవేశాలు పొందారని డీఈఓ డి.వాసంతి, కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలో బడిబాట ద్వారా ఈనెల 18వ తేదీ వరకు 4,108మంది విద్యార్థులు నమోదైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

వరంగల్ అర్బన్/ఖిలా వరంగల్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని స్విమ్మింగ్ పూల్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయిలో ఆమె పనులు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేయాలని సూచించారు. ప్లానిటోరియాన్ని కమిషనర్ పరిశీలించారు. శివనగర్‌లోని మెట్ల బావిని, చింతగట్టు వద్ద పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్ని పర్యవేక్షించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, ఏఈలు శ్రీకాంత్, మోజామిల్, హబీబ్, నరేశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

దూరవిద్య కోర్సుల అడ్మిషన్లకు నోటిఫికేషన్



నోటిఫికేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ డిప్లొమా సర్టిఫికెట్, ఓరియెంటేషన్ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం 2025–2026లో ప్రవేశాలకుగాను నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను వీసీ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ బి.సురేశ్‌లాల్ తెలిపారు. ఈ నెల 20వ తేదీనుంచి జూలై 31వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. కోర్సులు, ఫీజుల వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, దూరవిద్యకేంద్రం సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌ముంజం, డాక్టర్ వి.జగన్, డాక్టర్ కొట్టే భాస్కర్ పాల్గొన్నారు.

అన్నను చంపిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు

కురవి: అన్నను చంపిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై నగేశ్ గురువారం తెలిపారు. సీరోలు గ్రామానికి చెందిన వల్లపు లింగన్న తన భూమిని సమానంగా పంచి ఇవ్వలేదనే కారణంతో అతడి రెండో భార్య కుమారులు నరేశ్, మహేశ్, నరేశ్ భార్య సౌందర్య, లింగన్న రెండో భార్య నర్సమ్మ, నున్న వీరన్న (నరేశ్ బావమరిది) కలిసి లింగన్న మొదటి భార్య కుమారుడు కృష్ణను ఈ 18న కత్తితో నరికి చంపారు. ఈ ఘటనలో మృతుడి తండ్రి లింగన్న ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరునెలలు జైలు

వరంగల్ లీగల్ : అప్పుగా తీసుకున్న రూ.4 లక్షలు చెల్లించని కారణంగా బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో నిందితురాలికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సీహెచ్. శ్రావణస్వాతి గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బ్రాహ్మణవాడకు చెందిన సుంకరి నరేందర్.. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన యాట భాగ్యలక్ష్మికి 2024, జూన్ 15వ తేదీన రూ.4 లక్షల అప్పు ఇచ్చాడు. ఈ మేరకు భాగ్యలక్ష్మి.. నరేందర్‌కు ప్రామిసరీ నోటు రాసి ఇచ్చింది. రెండు నెలల్లో మొత్తం తిరిగి ఇస్తానని చెప్పింది. అయితే వివిధ కారణాలతో ఇవ్వకుండా సెప్టెంబర్‌లో హనుమకొండలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంబంధించిన రూ.4లక్షల చెక్కు ఇచ్చింది. సదరు డబ్బులు డ్రా చేసే నిమిత్తం నరేందర్ 2024, అక్టోబర్ 10వ తేదీన చెక్కును బ్యాంకులో వేయగా అకౌంట్‌లో సరిపోను డబ్బులు లేవని అధికారులు చెక్కు చెల్లదని తిరిగి ఇచ్చారు. దీనిపై బాధితుడు తన న్యాయవాది బైరి మల్లేశం ద్వారా కోర్టును ఆశ్రయించాడు. విచారించిన కోర్టు.. చెల్లని చెక్కు ఇచ్చిన ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితురాలు భాగ్యలక్ష్మికి ఆరు నెలల జైలు శిక్ష, అప్పుగా తీసుకున్న మొత్తం రూ.4 లక్షలకు వడ్డీ, జరిమానా కింద రూ.3 లక్షలు మొత్తం రూ.7 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించింది.



కలహాల కాంగ్రెస్...

- కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలతో బట్టబయలు
- తారస్థాయికి చేరిన కాంగ్రెస్ గ్రూపువార్
- సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా
- ఎమ్మెల్యేలు రేవూరి, కడియంపై సీరియస్ వ్యాఖ్యలు
- ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ రాజకీయ దుమారం
- తాజా పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా?



కడియం శ్రీహరి



కొండా మురళీధర్‌రావు



రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్ : కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు మరోసారి భగ్గుమన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వ్యాఖ్యలతో బట్టబయలయ్యాయి. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా గురువారం వరంగల్ పోచమ్మమైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. పరోక్షంగా ఆయన పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం పార్టీవర్గాల్లో కలకలం రేపింది. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో స్తబ్దత కనిపిస్తున్నా.. కొండా మురళి వ్యాఖ్యలతో ఒక్కసారిగా రచ్చమొదలైంది. ఈ వ్యాఖ్యలపై కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి గాని స్పందించకపోగా, వారి అనుచరులు సైతం మౌనం వహించారు. పార్టీలో తీవ్ర సంచలనంగా మారిన కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానం సీనియర్ నాయకుల ద్వారా ఆరా తీసినట్లు సమాచారం.

మాజీ టీడీపీ నేతలే లక్ష్యంగా...

ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య కొంతకాలంగా అంతర్గత కలహాలు సాగుతున్నాయి. ప్రధానంగా మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మధ్య గతంలోనూ పరస్పర ఆరోపణలకు సంబంధించిన ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరలైంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో కొందరు ఎమ్మెల్యేలు కొండా సురేఖకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారన్న ప్రచారం జరిగింది. ఇందులో ప్రధానంగా గతంలో టీడీపీలో పనిచేసి.. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న కొందరు ఎమ్మెల్యేలు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని కూడా కొండా సురేఖ దంపతులు చాలాసార్లు తమ అనుచరులతో వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కొండా మురళీధర్‌రావు గురువారం పోచమ్మమైదాన్ సభలో కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేయడం కలకలంగా మారింది. 'కనుబొమ్మలు లేని నాయకుడు టీడీపీని భ్రష్టు పట్టించి.. చంద్రబాబును ఓడించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో నాటి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ తిష్ట వేశాడన్న' కొండా మురళీధర్‌రావు... '75 ఏళ్ల దరిద్రుడు, ముసలోడు ఎన్నికలకు ముందు మా వద్దకు వచ్చి మా కాళ్లు పట్టుకొని ఈసారి సీటు నాకు వదిలిపెట్టమని ప్రాధేయపడితే మా మద్దతుతో పరకాల ఎమ్మెల్యే అయ్యాడు' అని ఇద్దరిపై ఘాటైన ఆరోపణలు చేయడం రాజకీయవర్గాల్లో దుమారం రేపుతోంది.

గురువారం ఉదంతంపై అధిష్టానం ఆరా...

వరంగల్ కాంగ్రెస్‌లో దుమారం రేపిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి పరిణామాలపై ఓ వైపు ప్రభుత్వ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు ఇప్పటికే తెప్పించుకున్న ప్రభుత్వ పెద్దలు.. పార్టీ సీనియర్‌ల ద్వారా 'వరంగల్‌లో అసలేం జరుగుతోంది'ని ఆరా తీసినట్లు అత్యంత విశ్వసనీయవర్గాల సమాచారం. గురువారం రాత్రి కూడా ఉమ్మడి వరంగల్‌కు చెందిన నలుగురు సీనియర్ నాయకులతో టీపీసీసీ పెద్దలు మాట్లాడినట్లు తెలిసింది. అలాగే, గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలతో కూడా రాష్ట్ర పార్టీ బాధ్యులు ఒకరు మాట్లాడినట్లు సమాచారం. త్వరలోనే ఉమ్మడి వరంగల్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలను హైదరాబాద్‌కు పిలిచి మాట్లాడే అవకాశం ఉందని కూడా పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అభివృద్ధి పనులు ప్రారంభం

వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు మండలంలోని పైలట్ గ్రామం శాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్ని పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలతో కొన్ని ఇళ్లకు బిల్లులు రాలేదని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. బిల్లులు వచ్చేలా చూడాలని హౌసింగ్ అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

పీచర శివారులో రూ.23.76 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్ స్టేషన్ పనులను సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించి ఆగస్టు 15 వరకు పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇక్కడే మరో 220/132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి త్వరలోనే మంజూరు తీసుకొస్తా న్నారు. ఆగస్టులో 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, 220/132 కేవీ సబ్ స్టేషన్‌కు డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో శంకుస్థాపన చేయిస్తానన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పీచరలో రూ.50 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై నెల చివరి నాటికి మల్లన్న గండి నుంచి కన్నారం వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామంలోని ప్రతీ చెరువును గోదావరి జలాలతో నింపుతానన్నారు. గ్రామంలో త్వరలోనే మరో 25 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, విద్యుత్ శాఖ డీఈ సంపత్‌రావు, ఏడీఈ రాజేశ్వర్ రావు, హౌసింగ్ డీఈ సిద్ధార్థ నాయక్, ఏఈ సుష్మ, కుమారస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు బిల్లా యాదగిరి, మల్లికార్జున్, సద్దాం హుస్సేన్, రాంగోపాల్‌రెడ్డి, సమ్మయ్య, రాజిరెడ్డి, రవీందర్, సంపత్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్ల విధానం కొనసాగించాలి

- వరంగల్ చాంబర్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి



సదస్సులో రాష్ట్ర కాటన్ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

వరంగల్ చౌరస్తా : ప్రస్తుతం రాష్ట్రంలో సీసీఐ ద్వారా కొనుగోలు జరుపుతున్న విధానంతోనే పత్తి రైతులకు మేలు చేకూరుతుందని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కాంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి అన్నారు. ఢిల్లీలోని నీతి ఆయోగ్ భవన్‌లో గురువారం 'బహిరంగ మార్కెట్‌లో పత్తికి మార్కెట్ ధర, కనీస మద్దతు కంటే తక్కువ ధరలు పలుకుతున్న వ్యత్యాసాలు' అనే అంశంపై జరిగిన సదస్సుకు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనీష్ మల్పానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం 2025–26 కాటన్ సీజన్‌లో తెలంగాణలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టే స్కీం అమలులో ఎదురయ్యే సమస్యలపై రవీందర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్లకు అవసరమైన సదుపాయాలు, రెగ్యులేటెడ్ మార్కెట్లలో పత్తి నాణ్యత, బహిరంగ మార్కెట్‌లోని ధరలను నిర్ధారించడానికి ఎలాంటి ప్రత్యేక వ్యవస్థలు లేవన్నారు. అందుకే ప్రస్తుతం రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరుపుతున్న విధానమే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. పత్తి కొనుగోళ్లలో కనీస మద్దతు కంటే తక్కువ ధర పలికితే ఆ వ్యత్యాసపు ధరను నేరుగా రైతులకు చెల్లించడానికి కేంద్రం ప్రభుత్వం ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీంను పైలట్ ప్రాజెక్టు కింద వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు ప్రకటించినట్లు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రిత్వ శాఖ ఫైనాన్స్ డైరెక్టర్ పవన్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ జాయింట్ సెక్రటరీ లలిత్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అన్నకు తమ్ముడి శఠగోపం

- వ్యాపారంలో రూ.1. 37 కోట్లు ముంచిన తమ్ముడు
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు చల్లా సాంబలింగం

వరంగల్ చౌరస్తా : అన్నకు తమ్ముడు శఠగోపం పెట్టాడు. నమ్మి క్యాష్ కౌంటర్‌పై కూర్చోబెట్టినందుకు రూ.1.37 కోట్లు స్వాహా చేశాడు. మోసం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీనిపై చాంబర్ ప్రతినిధులు, పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు (అన్న) చల్లా సాంబలింగం విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు గురువారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను, తన తమ్ముడు సంపత్ కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో 2016 నుంచి కేశవ ట్రేడర్స్ పేరుతో మిర్చి వ్యాపారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్రమంలో తాను బయట విషయాలు చూసుకుంటుండగా తన తమ్ముడు సంపత్ క్యాష్ కౌంటర్ పై కూర్చుని ఆర్థిక లావాదేవీలు చూసేవాడన్నారు. ఈ క్రమంలో రూ.1.37 కోట్లు మోసం చేశారని పేర్కొన్నారు. తనకు రావాల్సిన డబ్బులు అడిగితే ఇవ్వనని.. పైగా డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ చక్రపాణి వద్దకు వెళ్లగా అతడు పంచాయితీ నిర్వహించి తనకు రావాల్సిన డబ్బును చెల్లించాలని తన తమ్ముడికి చెప్పారన్నారు. అయితే తన తమ్ముడు చెల్లించకపోవడంతో మూడు నెలల క్రితం ఏనుమాముల పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా చాంబర్ ప్రతినిధులు, పోలీసులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

అడవి నుంచి.. పుడమి తల్లి ఒడికి

- నేడు మావోయిస్టు నేత గాజర్ల రవి అంత్యక్రియలు
- స్వగ్రామం వెలిశాలలో ఆయన జ్ఞాపకార్థం వెలిసిన ఫ్లెక్సీలు
- చివరి చూపు కోసం గ్రామస్తుల ఎదురుచూపు



వెలిశాలలో గ్రామస్తులు

టేకుమట్ల: గాజర్ల రవి.. పెత్తందార్లు, దొరల అరాచకాల నుంచి పీడిత ప్రజల విముక్తి కోసం మూడు దశాబ్దాలకు పైగా మావోయిస్టు సానుభూతిపరుడిగా, విద్యార్థి యూనియన్ నాయకుడిగా ఉద్యమంలోకి అడుగు పెట్టి దళ కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. నాయకత్వ లక్షణాలు పునికి పుచ్చుకుని అనతి కాలంలోనే నార్త్ తెలంగాణ డివిజన్ కమిటీకి ఎన్నికై కేంద్ర కమిటీ సభ్యుడిగా, స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా కీలక బాధ్యతలు తీసుకుని ఉద్యమంలో నూతన ఒరవడికి నాంది పలికాడు. ఎన్నో కీలక ఆపరేషన్లు విజయవంతంగా చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి 1992లో అడవి బాట పట్టాడు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగాడు.

ఉద్యమాలే ఊపిరిగా..

కుటుంబ సభ్యుల కన్నా ఉద్యమాలే ఊపిరిగా, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా మూడు దశాబ్దాలుగా అడవి తల్లి ఒడిలో కాలం గడిపాడు. తల్లిదండ్రులను సైతం కాదని అడవి తల్లి చెంతకు చేరిన గాజర్ల రవి ఉద్యమ ప్రస్థానం బుధవారంతో ముగియడంతో శుక్రవారం పుడమి తల్లి ఒడికి చేరనున్నాడనని నాటి ఉద్యమకారులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. రవి జ్ఞాపకార్థం వెలిశాలతోపాటు, పలు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

చివరి చూపు కోసం ఎదురుచూపు..

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్ మృతి చెందాడనే సమాచారం సోషల్‌మీడియాలో దావానంలా వ్యాపించడంతో వెలిశాల ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెండు రోజులుగా గాజర్ల రవి చివరి చూపు కోసం జిల్లా వ్యాప్తంగా ఎదురు చూస్తున్నారు. గురువారం రాత్రి రంపచోడవరంలో పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో సోదరులు గాజర్ల సమ్మయ్య, అశోక్.. రవి పార్థివదేహాన్ని స్వగ్రామం వెలిశాలకు తీసుకురానున్నారు. కాగా, బుధవారం నుంచే వెలిశాలలో పోలీసులు రెక్కీ నిర్వహిస్తున్నారు.

చర్చల సమయంలో చివరిగా చూశా..



2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు మావోయిస్టులను చర్చలకు పిలువగా వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి రవ(రవి)న్న చర్చల ప్రతినిధిగా వస్తున్నాడని తెలిసి వెళ్లా. ఎంతో మంది ప్రజలు హాజరైన కార్యక్రమంలో దూరం నుంచి చూశా. ఇప్పుడు విగత జీవిగా చూస్తామని అనుకోలేదు.

-అచ్చె లచ్చన్న, మాజీ సర్పంచ్, రామకిష్టాపూర్(వి)

నేడు కేయూలో ఉద్యోగ సంఘాల ఎన్నికలు

- ముగిసిన ప్రచార హోరు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్‌జీఓ ఎంప్లాయిస్, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీ ప్రిన్సిపల్ కార్యాలయం, పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ , ఖమ్మం పీజీ కాలేజీ, భద్రాద్రి కొత్తగూడెం కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈనెల 21న ఉదయం 11 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుంది. ఆ తర్వాత ఫలితాలు వెల్లడిస్తారు.

క్యాంపస్‌లో సందడే.. సందడి

రెండు అసోసియేషన్ల ఎన్నికల నేపథ్యంలో ఆయా ఉద్యోగుల ప్రచారంతో క్యాంపస్‌లో కొద్ది రోజులుగా సందడి నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. కేయూ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బి.నవీన్ కుమార్, జి. నిరంజన్ పోటీపడుతున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎండి. యూనస్, పి. భాస్కర్, జనరల్ సెక్రటరీ పదవికి వల్లాల తిరుపతి, సయ్యద్ అక్రమ్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (జనరల్)కు ఎ. సతీశ్‌బాబు, బి. రాజు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్) పదవికి బి. కృష్ణవేణి, గౌసియాబేగం, దేవమ్మ, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్)కు జి. మధుకర్, టి. ప్రభాకర్, పి. సుశీల్, ట్రెజరరీగా సీహెచ్. ప్రవీణ్‌కుమార్, టి. దామోదర్ పోటీపడుతున్నారు. 222 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు.

కేయూ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్..

కాకతీయ యూనివర్సిటీ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పి. గుమ్మయ్య, ఎండి. నిజాముద్దీన్ పోటీపడుతున్నారు.జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్(జనరల్) పదవికి ఎండి. వలిపాషా, టి. రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్) పదవికి ఎస్. ఐలయ్య, పి. వేణు, ట్రెజరరీ పదవికి టి.తరుమల్ శ్రీనివాస్‌సింగ్, పి. రామనాథం పోటీపడుతున్నారు. 79 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు.

ఇప్పటికే ముగ్గురు ఏకగ్రీవం..

క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీ పదవికి బొక్క మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి. అంకూస్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్)గా జి. మల్లికాంబ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విధితమే.

పోటాపోటీ ప్రచారం..

ఈ రెండు అసోసియేషన్ల ఎన్నికల్లో పోటీపడుతున్న వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం చేశారు. అన్ని విభాగాలు, కాలేజీల్లో తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం సాయంత్రం ప్రచారం ముగిసింది. ఎన్నికైన వారు రెండు సంవత్సరాలు ఆ పదవుల్లో ఉంటారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE
3BHK, 1st ఫ్లోర్. 1478 sft (కొత్తది). E/F, అక్షర స్కూల్ ప్రక్కన, భవానీనగర్ (డీజిల్‌కాలనీ), కాజీపేట - Hyd రోడ్‌కి అతిసమీపంలో మరియు వరంగల్ పబ్లిక్ స్కూల్‌కు అతిసమీపంలో KBR రెసిడెన్సీ, 3BHK ఫర్నిష్డ్ 1445 sft (పాతది) FLATS అమ్మబడును.
Cont: 9100777888

SERVICES

LOANS
శివబాలాజీ లోన్స్: స్లాబు, పెంకుటిల్లు, రేకుల కప్పు, టేకోవర్ లోన్స్, అన్ని రకాల వ్యాపారులకు లోన్స్, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్, సిబిల్ లేకున్నా, సిబిల్ బ్యాడ్ ఉన్నా లోన్స్ ఇవ్వబడును. WGL- 8522825358 [WA-6702]

BUSINESS OFFER
Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing / Fixed Returns. Safe and Secure. Ph: 6301859174. [HA-SCA25005068]

WANTED
Pharmacy Boys (Experienced), Lab Technicians (Experienced), Computer Operators & Supervisors. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, WGL. Timings: 12-00pm to 2-00pm. [WA-524]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'జంపన్న' సుందరీకరణ ..

- వాగు అభివృద్ధి పనులకు నిధులు
- రూ. 5 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఆహ్లాదకరంగా మారనున్న స్నానఘట్టాలు



మేడారంలోని జంపన్న వాగు

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సమయంలో కోట్లాది మంది పుణ్యస్నానాలు ఆచరించే జంపన్న వాగును సుందరీకరించనున్నారు. భక్తులకు మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ నిధులతో వాగును అభివృద్ధి చేయనున్నారు. మంత్రి సీతక్క చొరవ మేరకు జంపన్న వాగుపై రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసినట్లు సమాచారం.

జంపన్న వాగు ఒడ్డున పార్కులు, బెంచీల ఏర్పాటు..

జంపన్న వాగుపై రెండు వైపులా స్నాన ఘట్టాలు నిర్మించారు. జాతర సమయంలో భక్తులు స్నాన ఘట్టాలపై అమర్చిన బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్ ద్వారా స్నానాలు ఆచరిస్తారు. అయితే వాగుపై స్నాన ఘట్టాలు తప్ప కొత్తదనం ఏమీ కనిపించదు. ఈ నేపథ్యంలో ఈసారి మహాజాతర నాటికి స్నాన ఘట్టాల వద్ద భక్తులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పార్కులు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా ఒకటి రెండు కాటేజీలను కూడా నిర్మించనున్నారు. జాతర సమయంలో భక్తులు ఎండ, వర్షం నుంచి ఉపశమనం పొందేందుకు జంపన్న వాగు ఒడ్డున షెడ్లు కూడా నిర్మించే అవకాశం ఉంది. ఫలితంగా సుందరీకరణతో ఈసారి జాతరకు వచ్చే భక్తులకు జంపన్న వాగు ఆకర్షణీయంగా కనిపించనుంది.

మంత్రి సీతక్క చొరవతో..

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మేడారంలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా జంపన్న వాగు భక్తులకు ఆకర్షణీయంగా కనిపించాలనే సంకల్పంతో సుందరీకరణ పనులకు నిధుల మంజూరుకు కృషి చేసినట్లు తెలుస్తోంది. జంపన్న వాగులో ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత మహాజాతరలోనే సమ్మక్క–సారలమ్మ చిహ్నాలుగా వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారు. అయితే ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో ఈసారి మహాజాతర వరకు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈవిషయంపై టూరిజం కార్పొరేషన్ ఏఈ విజయకుమార్‌ను వివరణ అడగగా జంపన్నవాగులో రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తనకు సమాచారం తెలియదన్నారు. నేటి(శుక్రవారం) మధ్యాహ్నం కల్లా వివరాలు తెలుస్తాయన్నారు.

ఆర్ట్స్ కాలేజీ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను గురువారం కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ కళాశాలలో విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,236మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 620 మంది (50.16శాతం) ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 927మంది విద్యార్థులు హాజరుకాగా 540 మంది ఉత్తీర్ణత(58.25శాతం) సాధించారు. అలాగే, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 742 మంది విద్యార్థులు హాజరుకాగా 582 మంది (78.44శాతం) ఉత్తీర్ణత సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి సుధీర్, గిరిప్రసాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల ఆందోళన

- ధర వ్యత్యాసంతో వ్యాపారులపై అన్నదాతల అసహనం
- నచ్చచెప్పిన మార్కెట్ అధికారులు
- మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన కాంటాలు



మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్రంలోని ఇతర మార్కెట్లలో పసుపు క్వింటాల్‌కు ధర రూ. 12,500 పలుకుతుండగా, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రూ. 10వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ధర పెంచే వరకూ అమ్మబోమని తేల్చిచెప్పారు. దీంతో కాంటాలు నిలిచాయి. వ్యాపారులు తమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు చొరవ చూపించినా రైతులు అంగీకరించలేదు. చివరకు మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి జోక్యం చేసుకుని వ్యాపారులతో చర్చలు జరపగా, క్వాలిటీ పసుపునకే ఎక్కువ ధర చెల్లిస్తామని, లేనిపక్షంలో చెల్లించమని పేర్కొన్నారు. అనంతరం కార్యదర్శి రైతులతో మాట్లాడి సరైన ధరలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కాంటాలు ప్రారంభమయ్యాయి.